క్లుప్తంగా

పరీక్ష సామగ్రి పంపిణీ

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో నాలుగు, ఐదో తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు రాజురా గ్రామానికి చెందిన ఎర్రల్లో రాజు గురువారం పరీక్ష సామగ్రి అందజేశారు. గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులకు ఏటా పరీక్ష సామగ్రి అందిస్తున్న రాజును గ్రామస్తులు అభినందించారు. సర్పంచ్ భోజాబాయి, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబారావు, ప్రధానోపాధ్యాయులు ఎల్లన్న, ఉపాధ్యాయులు ఉమారాణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు పంపిణీ



కానుకలు అందిస్తున్న నాయకులు

కుంటాల: రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం సరఫరా చేసిన కానుకలను గురువారం మండలంలోని లింబా(కే) గ్రామంలో ముస్లింలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, దత్తాత్రి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శంకర్‌గౌడ్, ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ గిరీశ్‌కుమార్, ఖైదీర్, గజ్జారాం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'మెడవిరుపు'పై అవగాహన

సోన్: వరి పంటను సోకుతున్న మెడవిరుపు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మాదాపూర్ ఏఈవో అశోక్ అన్నారు. గురువారం మండలంలోని మాదాపూర్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పంట ప్రస్తుతం పొట్టదశకు చేరిందని.. మెడవిరుపు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కాంగ్రెస్ సభకు తరలిరావాలి

కడెం: మంచిర్యాలలో శుక్రవారం నిర్వహించే భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు, కాంగ్రెస్ అగ్రనేతలు సభకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఫీక్, బబ్లూ, రహీం, యాదగిరి, జగన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కార్మికులకు వైద్యశిబిరం

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో సీపీఐ అనుబంధ సంస్థ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణరంగ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కడెం, దస్తురాబాద్ మండలాల కార్మికులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భుక్య రమేశ్, ఏఐటీయూసీ నాయకులు కోటయ్య, కొమురయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన సాయిలు నర్సయ్య అనే వృద్ధుడు గురువారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని పోట్‌పల్లికి చెందిన మున్నూరుకాపు సంఘం సభ్యులు అంత్యక్రియల కోసం బాధిత కుటుంబసభ్యులకు రూ. ఐదు వేలు అందించారు. మన్మద్ సర్పంచ్ శే ఖర్‌రెడ్డి, పోట్‌పల్లి సర్పంచ్ సురేఖబాయి, మున్నూరుకాపు సంఘం సభ్యులు భోజన్న, సాయిరాం, సేనాపతి, గంగాధర్, దేవేందర్ ఉన్నారు.

రిపోర్టర్‌పై కేసు

నిర్మల్‌టౌన్: అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్న రిపోర్టర్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌కు చెందిన రషీద్ అలం అనే వ్యక్తి ఓ ఉర్దూ దినపత్రిక రిపోర్టర్. ఇతడు చించోలి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఈద్గాకు ఎవరు ప్రార్థనలకు వెళ్లవద్దని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలుగుతుందనే పలువురి ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

భక్తిమార్గంలో పయనించాలి

తానూరు: భక్తిమార్గంలో పయనిస్తే ప్రశాంతంగా ఉంటామని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన యోగేశ్ మహరాజ్ అన్నారు. మండలంలోని బెంబర గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాళ్యకీర్తనలో వారు పాల్గొని భక్తులకు ప్రవచనాలు చెప్పారు. తల్లిదండ్రుల సేవ చేయాలని యువతకు సూచించారు. అనంతరం ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. సప్తాహంలో పాల్గొన్న మహారాజ్‌లను సప్తాహం కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

18న ఆత్మీయ సమ్మేళనం

కుంటాల: మండల కేంద్రంలో ఈనెల 18న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో నాయకులు సమావేశమయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాత్రి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ శంకర్‌గౌడ్, ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు బుచ్చన్న, రమణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గొంతెండుతోంది..!

- కుభీర్ మండలంలో అడుగంటిన భూగర్భజలాలు
- సరఫరా కాని భగీరథ జలం
- అవసరాలు తీర్చుకునేందుకు అవస్థలు
- అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



వీర్‌గాం తండాలో నీటి కోసం గుమిగూడిన మహిళలు

కుభీర్: మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటితో పాటు కనీస అవసరాలు తీర్చుకునేందుకు అల్లాడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల మహిళలు బోరుబావుల నీటి కోసం గుమిగూడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

కుభీర్ మండలంలో..

మండలంలోని 41 గ్రామపంచాయతీల పరిధిలో 70 గ్రామాలున్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావులు పనిచేయడం లేదు. మండలంలోని ఆరు గ్రామాల్లో నీటిఎద్దడి నెలకొంది. వీర్‌గాం తండా, పల్సినయాబాది, రంజని, గోడాపూర్, కుప్టి, రాంనాయక్‌తండా అనే ఆరు గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

- తమ గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని పల్సి నయాబాది గ్రామస్తులు ఇటీవల బిందెలతో ఎంపీపీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.
- గోడాపూర్‌లో నీటి సమస్య కారణంగా మన ఊరు–మనబడిలో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవన పనులు నిలిచిపోయాయని ఇటీవల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.
- కుప్టిలో బోరుబావులు ఎండిపోవడంతో పక్కనున్న వర్ని గ్రామం నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. కరెంట్ లేని సమయంలో తాగునీటికి ఇబ్బంది అవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.
- వీర్‌గాంతండాలో ఉన్న ఒకే బోరు వద్ద తండావాసులు గంటల తరబడి నిలబడి నీటిని తీసుకెళ్తున్నారు.



రాంనాయక్‌తండాలో నీటి కోసం ప్రజల కష్టాలు

- రంజని గ్రామంలో కొన్ని బోరుబావులు మాత్రమే పని చేస్తున్నాయి. భగీరథ జలం రాకపోవడంతో తాగునీటికి గోస పడుతున్నారు.
- రాంనాయక్ తండాలో భగీరథ అంతర్గత పైప్‌లైన్ పనులు పూర్తయినా నీళ్లు ఇవ్వడం లేదు. వ్యవసాయ చేనులో ఉన్న బోరుబావి నుంచి నీళ్లు పైప్‌లైన్ ద్వారా వస్తాయి. తండా మొత్తం గుమిగూడి అక్కడి నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు.

చేన్ల నుంచి తెచ్చుకుంటున్న వైనం..

తమ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని పల్సి, రంజని, రాంనాయక్ గ్రామస్తులు పేర్కొంటున్నారు. భగీరథ అధికారులు మాత్రం కరెంట్ సమస్యతో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. వీర్‌గాం, కుప్టి తదితర గ్రామాల్లో కొందరు చేన్లలోని బోరుబావుల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించి.. తమకు నీటి కష్టాలను దూరం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఇబ్బంది అవుతుంది



మా గ్రామంలో 700 వరకు జనాభా ఉంది. ఉన్న బోరు బావులు ఎండిపోయాయి. అనుబంధ గ్రామమైన వర్నిలో ఉన్న బోరుబావి నుంచి పైప్‌లైన్ ద్వారా ట్యాంకులోకి ఎక్కించి కుళాయిల ద్వారా నీళ్లు ఇస్తున్నారు. కరెంట్ లేనప్పుడు నీళ్ల కోసం చాలా ఇబ్బంది అవుతుంది. – శంకర్, కుప్టి

సమస్య పరిష్కరిస్తాం

పల్సి గ్రామస్తులు నీటి సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. కొంతవరకు సమస్య పరిష్కరించాం. మిగతా గ్రామాల్లోనూ పరిశీలించి నీటి సమస్య పరిష్కరిస్తాం. భగీరథ అధికారులతో మాట్లాడి ఎందుకు సరఫరా చేయడం లేదో తెలుసుకుంటాం. – కవిరాజు, ఎంపీడీవో, కుభీర్

అటెన్షన్ ప్లీజ్.. వంగిన స్తంభం సరిచేయరూ



కుభీర్: మండల కేంద్రం శివారులో దొంతుల లింగన్న చేనులో విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో చేనులో పనులు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకున్నాడు.

ప్రశ్నించాల్సిన అధికారి: అజీజొద్దీన్, విద్యుత్ ఏఈ, ఫోన్: 94408 11711

నేడు 'విషు' పూజ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం కేరళ సంప్రదాయం ప్రకారం 'విషు' పడి పూజ నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు బద్రి శ్రీనివాస్, కనపర్తి విఘ్నేశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు మహాఅన్నదానం, రాత్రి ఏడు గంటల నుంచి మహా పడిపూజ కార్యక్రమం ఉంటుందన్నారు.

నేటి ర్యాలీలో పాల్గొనాలి

కడెం: కన్నాపూర్ అంబేద్కర్ విగ్రహం నుంచి కడెం అంబేద్కర్ విగ్రహం వరకు శుక్రవారం ఉదయం నిర్వహించే ర్యాలీలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణ సాధన సమితి కన్వీనర్ సునారికారి రాజేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జెడ్పీ కోఆప్షన్ రఫీక్ అహ్మద్, సర్పంచ్ గంగన్న, రాజలింగం, రాజేశ్, ఇందూర్ తదితరులు ఉన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసి లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించే వైద్య శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: శాకుంతలం

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- పలుచోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ



నిర్మల్‌లో చెక్కు అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగాపూర్: ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి వారి వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ఆర్థికసాయం అందిస్తుందని దేవాదాయ, న్యాయ, అటవీ పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో 77మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, ఆలూరు, కౌట్ల(బి) పీఏసీఎస్ చైర్మన్లు మాణిక్‌రెడ్డి, నారాయణరెడ్డి, మాధవరావు, స్థానిక సర్పంచ్ సుజాత, నర్సారెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో పట్టణంలోని 176 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి రాం కిషన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రం తనిఖీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో కంటివెలుగు వైద్య శిబిరాన్ని గురువారం మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు కంటి సమస్యల నుంచి విముక్తి కల్పించేందుకే సీఎం కంటివెలుగు కార్యక్రమం తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో రెండు లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. దృష్టి లోపం ఉన్న 21,500 మందికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జి.ఈశ్వర్, డీఎంహెచ్‌ఓ ధనరాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్

లక్ష్మణచాంద: పని ప్రదేశంలో ఉపాధి కూలీలు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో మోహన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం రోజుకు రూ.272 చెల్లిస్తుందని.. కూలీలు తమకు నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవాలన్నారు. వారి వెంట ఎంపీవో నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, ఎఫ్ఏ ఆశన్న తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో గురువారం ఉపాధిహామీ పనులను సర్పంచ్ ప్రవీణ్ ప్రారంభించారు. సకాలంలో పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు వెళ్లాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో సోలంకి భీంరావు, పలువురు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'ఆయకట్టుకు నీరందించడంలో నిర్లక్ష్యం'

- సదర్మాట్ పరిశీలించిన కడెం రైతులు



గైడ్‌వాల్ దెబ్బతినడంతో గోదావరిలోకి వృథాగా పోతున్న నీటిని చూపుతున్న రైతులు

ఖానాపూర్: సదర్మాట్ ఆనకట్ట పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కడెం మండలానికి చెందిన రైతులు ధర్మాజి కిష్టయ్య, మల్లారెడ్డి, స్వామి, చిన్నయ్య ఆరోపించారు. గురువారం ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్‌ను కడెం మండల రైతులు సందర్శించి మాట్లాడారు. సదర్మాట్ ఆనకట్ట వద్ద గైడ్‌వాల్ దెబ్బతినడంతో నీరంతా వృథాగా గోదావరిలోకి వెళ్తుందన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆనకట్ట గేట్లకు అడ్డుగా ఉన్న ఇసుక మేటను తొలగించకపోవడంతో నీరు గేట్ల ద్వారా కిందకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈవిషయమై అక్కడికి వచ్చిన జేఈ ఉదయ్‌కి రైతులు సమస్యను చూపి వివరించారు. కడెం మండలంలోని లింగాపూర్, ఎల్లగడప, దిల్‌దార్‌నగర్, మద్దిపడగ, పెత్తర్పు, మాసాయిపేట్, వకీల్‌నగర్, చిట్యాల, కొత్తమద్దిపడగ, పాత మద్దిపడగ, పెద్దుర్, పెద్దుర్‌తండా, కన్నాపూర్, చిన్నబెల్లాల్, పెద్దబెల్లాల్ గ్రామాల పరిధిలోని ఆయకట్టు రైతులకు నీరందక తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

వృథాగా పోకుండా చూస్తాం : జేఈ

ఎగువ ప్రాంతంలో మోటార్లతో నీటిని వినియోగించడం ద్వారా ఇక్కడకు నీరు తక్కువ వస్తుందని సదర్మాట్ జేఈ ఉదయ్ అన్నారు. గైడ్‌వాల్ దెబ్బతిన్న చోట నీరు వృథాగా పోకుండా ఇసుక సంచులను వేస్తామని జేఈ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ హిమబిందు

సోన్: మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హిమబిందు పేర్కొన్నారు. మండలంలోని న్యూవెల్మల్‌లో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్లాట్లు చేసుకోవడంతో ఈనెల 10న న్యూవెల్మల్ గ్రామస్తులు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ న్యూవెల్మల్ గ్రామం వచ్చి విచారణ జరిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో సేత్వార్ భూముల సర్వే కొనసాగుతుందన్నారు. తర్వాత ప్లాట్ల సర్వే చేస్తామని.. అప్పటివరకు వేచి ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఎంపీటీసీ నాగయ్య, వీడీసీ సభ్యులు అంకం శ్రీనివాస్, మనోహర్‌రావు, తోట సాయన్న, మల్లయ్య, రాజలింగం, కిరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసమే పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: సమస్యల సాధన, సామాజిక న్యాయం కోసమే పాదయాత్ర చేపట్టినట్లు సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో సీఐటీయూ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, కులవివక్ష నిర్మూలన, కనీస వేతనాలు అమలు, రిజర్వేషన్ల సాధన కోసం ఈ పాదయాత్ర నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గంగామణి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రకళ, సువర్ణ, లక్ష్మి, స్వప్న, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. మధ్యాహ్న హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

బీజేపీ సంబురాలు

లక్ష్మణచాంద: నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో ఆ పార్టీ నాయకులు గురువారం రాత్రి సంబురాలు చేసుకున్నారు. ఏలేటి రాకతో జిల్లాలో పార్టీ బలోపేతమవుతుందని పలువురు పేర్కొన్నారు. మండల ఉపాధ్యక్షుడు రంజిత్, రాజు, అశోక్, వెంకట్, సుమన్, రజనీకాంత్, పోతన్న పాల్గొన్నారు .

'కంటివెలుగు' ప్రారంభం

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం కంటివెలుగు వైద్య శిబిరాన్ని ఎంపీపీ సింగరి కిషన్ ప్రారంభించారు. సర్పంచ్ రాజమణి, జెడ్పీటీసీ శారద, ఎంపీడీవో విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ తెలంగారావ్, కంటివెలుగు ఇన్‌చార్జి డాక్టర్ నాగరాజు, కార్యదర్శి ఇందుమతి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని నంద్‌గాంలో గురువారం కంటివెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ అబ్దుల్ గన్ని ప్రారంభించారు. ఎంపీవో మోహన్‌సింగ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని అంబకంటిలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ప్రదీప్‌కుమార్ ప్రారంభించారు. ఎంపీటీసీ సుధాకర్, ఉపసర్పంచ్ రమేశ్, శృతిరెడ్డి, దామోదర్, సాయినాథ్, కార్యదర్శి ఉత్తం పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని గురువారం జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ప్రారంభించారు. పలువురికి కంటిఅద్దాలు అందజేశారు. వైద్యాధికారి సందీప్, సర్పంచ్ ముత్తవ్వ, ఎంపీటీసీ రాణి, శ్యాంసుందర్, సాయన్న, అనిల్, ప్రశాంత్, భోజన్న ఉన్నారు.

'రాష్ట్రంలో వచ్చేది బీజేపీ సర్కారే'



మాట్లాడుతున్న జెడ్పీటీసీ జానుబాయి, నేతలు

ఖానాపూర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ సర్కారేనని.. తెలంగాణ ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్‌కే అధికారం కట్టబెడుతారని పెంబి జెడ్పీటీసీ బుక్య జానుబాయి పేర్కొన్నారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులంతా కలిసి పని చేసి ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పుప్పాల మనోజ్, సందుపట్ల శ్రావణ్, గుడాల రాజన్న, కీర్తి మనోజ్, నాయిని లక్ష్మణ్, సంద వేణు, తదితరులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహశుద్ధి

ఖానాపూర్ పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో గురువారం విగ్రహశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెంబి జెడ్పీటీసీ జానుబాయి తదితరులు పాల్గొన్నారు. బుచ్చన్నయాదవ్, స్వామి, ఉపేందర్, రాజన్న, రవి, సుధాకర్, రాము, సాయి, తదితరులున్నారు.

స్థల వివాదం..దేవుడే పరిష్కరించాలి



స్థలం పరిశీలిస్తున్న అధికారులు

కడెం: మండలంలోని గంగాపూర్ గ్రామంలో నూతన క్వార్టర్ నిర్మించేందుకు అటవీ అధికారులు పాత క్వార్టర్‌ను కూలగొట్టి పనులు చేపట్టారు. అయితే సదరు స్థలం గ్రామానికే చెందిందని.. క్వార్టర్ నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్తులు పనులు అడ్డుకున్నారు. గురువారం ఎస్సై రాజు, అధికారులు స్థలం పరిశీలించారు. క్వార్టర్‌ను గ్రామ శివారులో నిర్మించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సదరు స్థలంలో శివలింగం ప్రతిష్ఠించారు. క్వార్టర్ పక్కనున్న స్థలంలో ఆలయం నిర్మించుకోవాలని అటవీ అధికారులు చెప్పినా గ్రామస్తులు వినకపోవడంతో వివాదం పరిష్కారం కాలేదు.